సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 28 । నవంబర్ । 2024



బాల్య వివాహాలు నిర్మూలించాలి

బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు.

8లో



నోటీసులతో సరి

చింతలవీధి మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణదారులకు అధికారులు నోటీసులిచ్చి సరిపెట్టారు.

8లో



మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి విజ్ఞానం కేంద్రం కృషి చేస్తోందని కో–ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

8లో

న్యూస్‌రీల్

వీడీవీకేల అభివృద్ధికి ప్రోత్సాహం

– ఐటీడీఏ పీవో అభిషేక్



భీమవరంలో గిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: వన్‌ధన్ వికాస కేంద్రాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తామని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మండలంలోని భీమవరంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని సందర్శించి, కొండ చీపుళ్ల తయారీని పరిశీలించారు.పెద్ద మాల్స్‌లో విక్రయించేందుకు వీలుగా నాణ్యమైన చీపుళ్లను తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. వీడీవీకేలకు అవసరమైన పని ముట్లను సమకూరుస్తామని చెప్పారు. త్వరలోనే హట్ బజార్ల నిర్మాణాలను పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు. హట్ బజార్లో గిరిజన ఉత్పత్తులు విక్రయించడానికి ఏర్పాటు చేస్తామని చెప్పారు. డీఆర్డీఏ పీడీ వి.మురళి, ఏరియ కోఆర్డినేటర్ రత్నకుమారి పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం హుండీ ఆదాయం రూ. 8 లక్షలు

రంపచోడవరం: ఐ.పోలవరం వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్టు టీటీడీ విజిలెన్స్ శాఖ జమేదారు చిన్న శ్రీనివాసులు తెలిపారు. పది నెలల కాలానికి రూ.8,04,500 లభించినట్టు చెప్పారు. ఆలయ అధికారులు నారాయణ రాజు, శివరాము ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. శ్రీవారి సేవా బృందం కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామిరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగును గుర్తించేందుకు డ్రోన్లతో సర్వే



కొత్తపాలెం ప్రాంతంలో డ్రోన్లతో సర్వే చేస్తున్న పోలీసులు

చింతపల్లి: జిల్లాలో చింతపల్లి, జి.మాడుగుల మండలాల సరిహద్దు గ్రామాల్లో గంజాయి సాగును గుర్తించేందుకు డ్రోన్లతో సర్వే చేస్తున్నారు. చింతపల్లి డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ ఆదేశాల మేరకు సరిహద్దు గ్రామాలైన వంజింగి, కుర్రుపాడు, కొత్తపాలెంలలో బుధవారం ఈ సర్వే జరిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. డ్రోన్ల సాయంతో గంజాయి తోటలను గుర్తించి, ధ్వంసం చేయడంతో పాటు సాగు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

చింతపల్లి ఆస్పత్రిలో వైద్య నిపుణుల భర్తీకి చర్యలు



ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ్

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. కొంత కాలంగా ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో జాయింట్ కలెక్టర్ ఆస్పత్రిని సందర్శించి, విచారణ నిర్వహించారు.ఆస్పత్రిలో వైద్యాధికారుల పనితీరు, నిధుల ఖర్చు,వైద్యాధికారుల కొరత తదితర పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు.ప్రస్తుతం ఆస్పత్రిలో మత్తు వైద్యులు లేకపోవడంతో శస్త్ర చికిత్సలు జరిగే అవకాశం లేకుండా పోయిందన్నారు. స్త్రీ వైద్యనిపుణుల కొరత కారణంగా ప్రసవం ఇబ్బంది అయితే గర్భిణులను మైదాన ప్రాంతానికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ సమస్యలను అధిగమించేందుకు, వైద్య నిపుణుల ను నియమించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. చిన్నపిల్లలు వైద్య నిపుణులను కూడా నియమించనున్నట్టు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డులు లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు వైద్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డు అందేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు చర్యలు తీసు కుంటామన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్టు జేసీ తెలిపారు.



జాతీయ రహదారి నిర్మించనున్న పాడేరు సినిమాహాల్ సెంటర్ రోడ్డు

రహదారి విస్తరణకు రాజకీయ గ్రహణం

- ఎన్‌హెచ్ నిర్మాణానికి అడ్డంకులు
- నోటీసులిచ్చినా స్పందించని ఆక్రమణదారులు
- ప్రభుత్వ పెద్దలతో టీడీపీ నేతల మంతనాలు
- రోడ్డు నిర్మాణానికి గిరిజన సంఘాల పట్టు

జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. స్థానిక వ్యాపారుల్లో పరపతి పెంచుకోవడం కోసం, రాజకీయ అవసరాల కోసం ఈ అంశాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కొందరు అధికార పార్టీ నేతలు యత్నిస్తున్నారు. విస్తరణ జరగకుండా పావులు కదుపుతున్నారు.



విస్తరణ వద్దని స్పీకర్ అయ్యన్న, గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణిలకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, వర్తకసంఘం నేత శ్రీను

సాక్షి,పాడేరు: ఏజెన్సీకి ప్రధాన కేంద్రంగా ఉన్న పాడేరు పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రధాన రహదారిని విస్తరించాలని చాలా కాలంగా స్థానికులు కోరుతున్నారు. కొత్త జిల్లాల ఆవిర్భావం తరువాత జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో వాహనాల రద్దీ రెట్టింపు అయింది. దీంతో రహదారి విస్తరణ తప్పనిసరిగా మారింది. సాధారణ రోజుల్లో కంటే పర్యాటక సీజన్‌లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది.ఐటీడీఏతో పాటు పలు శాఖల కార్యాలయాలు, కలెక్టరేట్‌కు వెళ్లాలన్నా సినిమాహాల్ సెంటర్ మీదుగా మీదుగానే రాకపోకలు సాగించాలి.ఆర్టీసీ కాంప్లెక్స్ కూడా ఈ రోడ్డులోనే ఉంది. ఇంత ప్రాధాన్యత గల రోడ్డును విస్తరించాలని మెజార్టీ ప్రజలు కోరుతున్నారు. ఇటీవల పాడేరు పట్టణం మీదుగానే లంబసింగి–అరకులోయ జాతీయ రహదారి నిర్మాణానికి ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయించారు. దీనికి కలెక్టర్ కూడా అనుమతులు మంజూరు చేశారు.అయితే ఈరోడ్డు నిర్మాణం జరిగితే షాపులు కోల్పోనున్న వారు దీనిని అడ్డుకునేందుకు టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరిని ఆశ్రయించడంతో ఈరోడ్డుకు రాజకీయ రంగు పులుముకుంది.

100 అడుగులకు మార్కింగ్

జాతీయ రహదారి నిర్మించనున్న జి.మాడుగుల రోడ్డులోని కలెక్టర్ పాత బంగ్లా నుంచి పాడేరు, గొందూరు,మోదకొండమ్మతల్లి గుడి, పాతబస్టాండ్,సినిమాహాల్ సెంటర్ మీదుగా తలారిసింగి వరకు ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా వంద అడుగులకు మార్కింగ్ ఇచ్చారు. ఈ రోడ్డులో జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుందని, 15 రోజుల్లో ఆక్రమణలను తొలగించాలని వర్తకులు,పలు వర్గాల ప్రజలను కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు.ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి వారం రోజులు కావస్తోంది.అయితే ఈరోడ్డు వెడల్పు పనులను అడ్డుకునేందుకు పలువురు పైరవీలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ పెద్దలకు వినతులు

పాడేరులో రోడ్డు విస్తరణ పనులను అడ్డుకునే లక్ష్యంగా ఇటీవల పాడేరు టీడీపీ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి,వర్తకసంఘం నేత శ్రీనివాస్,మరికొంతమంది నేతలు విజయవాడకు వెళ్లారు.విజయవాడలోని స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఇతర పెద్దలకు వినతిపత్రాలు ఇచ్చారు. దీంతో పలు వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న పాడేరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారపార్టీ నాయకులు రోడ్డు అభివృద్ధికి విఘాతం కలిగించే చర్యలకు పూనుకోవడం అన్యాయమని గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



రోడ్డుకు ఇరువైపులా 100 అడుగుల మార్కింగ్ ఇస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

రోడ్డు విస్తరణ జరగాల్సిందే



పాడేరు పట్టణంలోని సినిమాహాల్ సెంటర్‌తో పాటు మిగిలిన ప్రాంతంలో కూడా రోడ్డు విస్తరణ జరగాలి.రోడ్డు విస్తరణను అడ్డుకోవడం భావ్యం కాదు.సినిమాహాల్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది.జాతీయ రహదారి నిర్మాణం జరిగితే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలుగుతాయి.ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలి

– రామారావుదొర, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్, పాడేరు

గడువులోగా ఆక్రమణలు తొలగించాలి

కలెక్టర్,సబ్‌కలెక్టర్‌ల ఆదేశాలతో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను గడువులోగా తొలగించాలి. సినిమాహాల్ సెంటర్,ఇతర ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయి. రోడ్డు విస్తరణ పనులు నిలిపివేత ప్రచారంలో వాస్తవం లేదు.ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు.

– బాలసుందరబాబు, ఆర్అండ్‌బీ ఈఈ, పాడేరు

పంట చేతికొచ్చే వేళ.. కలవరం

- బంగాళాఖాతంలో వాయుగుండం
- తుపాను హెచ్చరికలతో ఆందోళన చెందుతున్న రైతులు
- జిల్లాలో 54 వేల హెక్టార్లలో వరి సాగు
- 40 శాతం కోతలు పూర్తి
- వర్షాలు కురిస్తే వరికి భారీ నష్టమే



హుకుంపేట మండలం చట్రాయిపుట్టులో సురక్షిత ప్రాంతాలకు వరి పనలను తరలిస్తున్న గిరిజన రైతులు



పాడేరులో ఆరబెట్టిన వరిపనలు



హుకుంపేట మండలం కామయ్యపేటలో టార్పాలిన్ కప్పిన వరికుప్ప

సాక్షి,పాడేరు: జిల్లాకు మరో తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్ముకుని.. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. తుపాను గుబులు వారిని వెంటాడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. ప్రస్తుతం హుషారుగా కోతలు చేపడుతున్నారు. కోతలు పూర్తయిన ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం తుపాను గుబులు వెంటాడుతున్న నేపథ్యంలో ధాన్యాన్ని భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 54వేల హెక్టార్లలో వరి, 20వేల హెక్టార్లలో రాగులు,సామలు తదితర చిరుధాన్యాలను గిరిజన రైతులు సాగు చేశారు. పాడేరు,రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో సరాసరి 40శాతం వరి కోతలను రైతులు పూర్తి చేశారు. పంట నూర్పులు 30శాతం పూర్తయ్యాయి.మిగిలిన భూముల్లో పంట కోతలకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం రైతులను కలవరపరుస్తోంది. కోసిన వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం,వరిపంట కుప్పలపై టార్పాలిన్‌లను కప్పడం తదితర పనుల్లో వారు నిమగ్నమయ్యారు. కొంతమంది రైతులు యంత్రాలతో త్వరితగతిన నూర్పులు జరిపి, ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్నారు. కోతలు జరగని భూముల్లో వర్షం నీరు సాఫీగా పోయే విధంగా కాల్వలను తవ్వుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వాయుగుండం ప్రభావంతో జిల్లాలోను వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఈ పరిస్థితుల్లో గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండి,వరితో పాటు వాణిజ్య పంటలను కాపాడుకునే చర్యలు చేపట్టాలి. కోత కోసిన వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. కోతలు జరగని ప్రాంతాల్లో భూముల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి.వరి కుప్పలపై టార్పాలిన్‌లు కప్పుకోవాలి.

– ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి

పాడేరు ఐటీడీఏకి ద్వితీయ స్థానం



గిరిజనుల సంప్రదాయ నృత్యం



జ్ఞాపికలు బహూకరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ముగిసిన గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

ఏయూక్యాంపస్(విశాఖ): గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. జనజాతి గౌరవ్ దివస్ వేడుకల్లో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ, టీజీఆర్–టీఎం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ నెల 15 నుంచి 26 వరకు గ్రామ, పంచాయతీ, ఐటీడీఏ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జనజాతి గౌరవ్ దివస్ నిర్వహించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి తెలియజేసే విధంగా ఈ కార్యక్రమాలను జరిపారు. స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా గిరిజన సంత, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. రుషికొండ వద్ద ఏర్పాటుచేసిన గిరిజన సంత, బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌లో గిరిజన ఉత్పత్తులు విక్రయాలు జరిపారు. ఈ కార్యక్రమాలలో ఎనిమిది ఐటీడీఏలు, 17 జిల్లాల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు, సాంస్కృతిక బృందాలు పాల్గొన్నాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పాడేరు ఐటీఏడీ ప్రాజెక్టు అధికారి అభిషేక్ బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో ప్రథమ స్థానాన్ని సీతంపేట, రెండో స్థానం పాడేరు ఐటీడీఏలు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మంద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చలి స్వైర విహారం



పాడేరులో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు/చింతపల్లి/డుంబ్రిగుడ : జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. లైట్లు వేసుకుని వాహనాలను నడపవలసి వస్తోంది. గిరిజనులు చలిమంటలను ఆశ్రయించి ఉపశమనం పొందుతున్నారు. డుంబ్రిగుడ మండలంలోని ఆంధ్ర,ఒడిశా సరిహద్దు తూటంగి పంచాయతీ బల్లకట్టు, లాసేరు తదితర గ్రామాల్లో ఎముకలు కొరికే చలితో జనం గజగజా వణికి పోతున్నారు. తీవ్రంగా వీస్తున్న చలిగాలులు, అధికంగా కురుస్తున్న మంచు వల్ల ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. డుంబ్రిగుడలో 8.2, జి.మాడుగులలో 8.7,హుకుంపేటలో 10, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 11.1, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 11.5,పెదబయలులో 12, అనంతగిరిలో 13,పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 13, కొయ్యూరులో 15.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా బుధవారం మరింతగా ఉష్ణోగ్రతలు తగ్గినట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్,ఉష్ణోగ్రతల విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.



తూటంగి పంచాయతీ బల్లకట్టు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు రోడ్డులో కమ్మేసిన పొగమంచు



చలిమంటతో ఉపశమనం పొందుతున్న గిరిజనులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్

మారేడుమిల్లి : గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. మారేడుమిల్లి మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. బోదులూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఫీడర్ అంబులెన్స్‌ల పనితీరును పరిశీలించారు. ఆకుమామిడికోట సమీపంలోని రూ.3.20 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రెండు వంతెనలను, ఆకుమామిడికోట గ్రామంలోని జీపీఎస్, మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ పిల్లలకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం రోజూ అందజేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి జన్మన్ పథకం ద్వారా పీటీజీల కోసం నిర్మిస్తున్న గృహాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పర్యాటక ప్రాంతమైన గుడిసెను సందర్శించారు. ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యాటకులు అసాంఘిక కార్యకలపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస రావు, తహసీల్దార్ బాలాజీ, ఎంపీడీవో శ్రీనివాస విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకుమామిడికోట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్



బోదులూరు పీహెచ్‌సీ వద్ద ఫీడర్ అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రతి మండలంలో వంద ఫారంపాండ్స్

- ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి మండలంలో వంద ఫారం పాండ్స్ నిర్మాణానికి గ్రామాలను గుర్తించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. పనులను వచ్చే నెల 25 నాటికి పూర్తి చేయాలన్నారు. బుధవారం డ్వామా ఆధ్వర్యంలో స్థానిక కాఫీ హౌస్‌లో ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అభివృద్ధి పనుల నిర్వహణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన పనులను గుర్తించాలని సూచించారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి పనులను కల్పించాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులను మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు

ముంచంగిపుట్టు : వైఎస్సార్‌సీపీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిను ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలలుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు.

ఇసుక ట్రాక్టర్లు నిలిపివేయడంపై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు



రంపచోడవరం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మండలప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలో పక్కా ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్ పి.వేణుగోపాల్ అకారణంగా నిలిపివేస్తున్నారని మండల ప్రజాప్రతినిధులు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మీ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి రంపచోడవరం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒకపక్క ఇసుకను ఉచితంగా ఇస్తానని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, మరోపక్క అధికారులు ట్రాక్టర్లను నిలిపివేస్తూ, సొమ్ము చెల్లించమంటూ వేధిస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ నిర్వహించి, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని వారు సబ్ కలెక్టర్‌ను కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వేదికపై అధికారులు



పాడేరులో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



అరకులోయలో మాట్లాడుతున్న అడ్వకేట్ మురళీమోహన్



హుకుంపేటలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

బాల్య వివాహాలు నిర్మూలించాలి

– కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం: బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. బాల్య వివాహం సాంఘిక దురాచారమని చెప్పారు. 18 సంవత్సరాల వయస్సు నిండకుండా బాలికలకు ఎట్టి పరిస్థితుల్లో వివాహం చేయరాదని తెలిపారు. జిల్లాలో ప్రతి బాలిక ఒక రోల్ మోడల్‌గా ఎదగాలని, పురుషులతో సమాన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. మంచి భవిష్యత్ కోసం బాలికలు బాగా చదవాలన్నారు. డిసెంబర్ 7న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత విద్య,భోజన, వసతి ఏర్పాటు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ బాలికలకు జీవితంలో మంచి భవిష్యత్‌ను ఇచ్చేది విద్య మాత్రమేనని చెప్పారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే బాగా చదువుకోవాలన్నారు. డీఎస్పీ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ విజయశాంతి, ఏడీఎంహెచ్‌వో శిరీష,తహసీల్దార్ ఎ.ఎస్.రామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పాడేరు : బాల్య వివాహాలు సామాజిక దురాచారమని, బాల్య వివాహాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ స్పష్టం చేశారు. స్థానిక కేజీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ అభిషేక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసగించారు. బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యంగా అందరు కృషి చేయాలన్నారు. బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవ్వాన్నారు. గిరిజన సమాజం ఎదగాలంటే బాలికలు బాగా చదువుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని బాగా చదువుకోవాలని చెప్పారు. డీఎస్పీ వేణుగోపాల్ మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఎదుగుదల వచ్చాక వివాహాలు చేసుకోవాలని సూచించారు. ఎవరైన వేధింపులకు గురి చేస్తే 1098 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే తమల్ని సంప్రదించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా, సీడీపీవో ఝాన్సీలక్ష్మి, డీసీపీవో డాక్టర్ సద్దు, అడ్వకేట్ ప్రసాద్‌నాయుడు, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయటౌన్ : కేంద్ర ప్రభుత్వ బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సీడీపీవోలు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాల ముక్తి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దాలని పలువురు సూచించారు. విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలన్నారు. కౌమర దశలో ఉన్న విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలన్నారు. బాల్య వివాహాల జరిగించేందుకు ఎవరైనా ప్రలోభ పెడుతుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యార్థులచే ర్యాలీలు, మానవహారం నిర్వహించి, బాల్య వివాహాలను అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.

అరకులోయ: స్థానిక జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో అడ్వకేట్ మురళీమోహన్ బాలిక హక్కులు, చట్టాల గురించి విద్యార్థులకు సూచించారు. తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండలంలోని కిల్లోగుడలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో నీలిమ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట మండలంలోని జరిగిన కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను స్థానికులు వివరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అత్యాచారాలు అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు అవగాహన కల్పించాలని కోరారు. సీడీపీవో బాలచంద్రమణి దేవి, ఈవోపీఆర్డీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో విజయకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువుల రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు

చింతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలకు అందరూ దూరంగా ఉండాలని, దీనిపై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో చైతన్య, సీడీపీవో విజయగౌరి, ఐటీడీఏ ఏవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, ఎంపీడీవో పీజీ. రామకృష్ణ, ఎస్‌ఐ భూషణం, సీడీపీవో సీహెచ్.లక్ష్మి, ఉపాధి ఏపీఓ ప్రకాష్, వెలుగు ఏపీఎం షణ్ముఖరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో దేవమణి , సూపర్‌వైజర్ అరుణ లత, హెచ్‌ఎం నాగ సుశీల తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో దేవమణి



డుంబ్రిగుడలో సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో విద్యార్థుల మానవహారం



చింతూరులో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి



కొయ్యూరులో ప్రతిజ్ఞ చేస్తున్న వర్కర్లు, సీడీపీవో విజయకుమారి



గంగవరంలోని అవగాహన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్‌ఐ భూషణం, సీడీపీవో లక్ష్మీ తదితరులు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

రంపచోడవరం: గిరిజన మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి విజ్ఞానం కేంద్రం కృషి చేస్తుందని కేవీకే కో–ఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ మేరకు కెవీకెలో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్థానిక మహిళలకు కడక్‌నాథ్ కోడిపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. ఇందు కోసం కడక్‌నాథ్ కోడి పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే వివిధ రకాల శిక్షణల ద్వారా ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కెవీకె ద్వారా ఇచ్చిన శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెవీకె మత్స్యశాఖ శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి అనువైన మేలైన కోళ్ల రకాలైన శ్రీనిధి, వనరాజ, కడక్‌నాథ్, ఘగస్ రకాల కోళ్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కోళ్ల దాణాగా మొక్కజొన్న, రాగులు, సామలు,అజోల్లా ఇవ్వాలని తెలిపారు. కోళ్ల పెరుగుదలకు కావాల్సిన మినరల్స్, విటమిన్స్ గురించి వివరించారు. ఏడీహెచ్ సూర్యనారాయణ, డాక్టర్ వీరేంధర్, కెవీకె శాస్త్రవేత్తలు, డాక్టర్ క్రాంతికుమార్, ప్రవీణ్‌బాబు, వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

హత్యకేసు నిందితుడికి జీవిత ఖైదు

మారేడుమిల్లి : హత్య కేసులో నిందితుడికి రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టు సాధారణ జీవిత ఖైదు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. 2022 సంవత్సరంలో మండలంలోని తాడేపల్లి పంచాయతీ పీజీలంక గ్రామానికి చెందిన కత్తుల మల్లురెడ్డి, కత్తుల సింగిరెడ్డి వరుసకు అన్న తమ్ముళ్లు. ఇరువురి నడుమ ఆస్తి తగాదాల కారణంగా కత్తుల మల్లురెడ్డి కత్తితో, సింగిరెడ్డిని హత్య చేశాడు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నేరం రుజువు కావడంతో బుధవారం రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టు తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి నిందితుడికి సాధారణ జీవిత ఖైదు, ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నోటీసులతో సరి

- చింతలవీధిలో జోరుగా అక్రమ కట్టడాలు
- నెలరోజుల క్రితం నోటీసుల జారీ
- స్వచ్ఛంధంగా తొలగింపునకు 15రోజుల గడువు
- అయినా ఆగని నిర్మాణాలు
- జాయింట్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

పాడేరు : మండలంలోని చింతలవీధి మేజర్ పంచాయతీ పరిధిలోని 516ఈ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక గిరిజనుల ఫిర్యాదుతో నెల రోజుల క్రితం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి, అక్రమ కట్టడాలను పరిశీలించారు. రహదారి నుంచి ఆ కట్టడాల వరకు కొలతలు తీసి, మార్కింగ్ వేయించారు. ఆక్రమణదారులకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అక్టోబర్ 22 నుంచి రెవెన్యూ అధికారులు సుమారు 30 మందికి నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లో స్వచ్ఛందగా తొలగించాలని, లేకపోతే తామే కూల్చివేస్తామని పేర్కొన్నారు. నోటీసులు జారీ చేసి నెల రోజులవుతున్నా చింతలవీధిలో అక్రమ కట్టడాల వైపే అధికారులు వెళ్లడం లేదు. దీంతో పలువురు యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారుల తీరుపై స్థానిక గిరిజనులు మండిపడుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి నోటీసులు జారీ చేసిన అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిని ఆదుకోండి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు స్వామిదొర

రంపచోడవరం: కొత్తవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ విధుల నుంచి తొలగింపునకు గురైన కంగల స్వామిదొరను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మద్యం సేవించి పాఠశాలకు వచ్చారనే కారణంతో విధుల నుంచి తొలగించడంతో తమ కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈ మనస్థాపంతో భవనంపై నుంచి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడడంతో వెన్నుపూస, రెండు కాళ్లు విరిగిపోవడంతో మంచంపై ఉన్నట్టు తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఉపాధి హామీ పథకం పోస్టర్ ఆవిష్కరణ



ఉపాధి హామీ పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీఓ అభిషేక్

పాడేరు : ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసిన కూలీల నిరుద్యోగులైన పిల్లలకు సిడాప్ సంస్థ అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ అభిషేక్ స్పష్టం చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో సీడాప్ రూపొందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ఉపాధి హామీ కూలీల పిల్లలకు వివిధ నైపుణ్యా రంగాల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. శిక్షణ కోసం ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు ఉపకార వేతనం అందించి శిక్షణ పూర్తయిన తర్వాత వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థులు 18 నుండి 35ఏళ్ళ వయస్సు కలిగి టెన్త్ ఉత్తీర్ణత ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవ్వాన్నారు. ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ ఏపీడీ మురళి, సీడాప్ జేడీఎం కళ్యాణి జగదీశ్వరి, ఉన్నతి సిబ్బంది పాల్గొన్నారు.

నూకన్నదొర చెరువును ఖాళీ చేయాల్సిందే

అడ్డతీగల: మండలంలోని రాజవరంలో నూకన్నదొర చెరువును ఆక్రమించిన వ్యక్తి వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని తహసీల్దార్ కొమరం సూర్యారావుదొర ఆదేశించారు. ఓ వ్యక్తి చెరువును ఆక్రమించినట్టు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై ఆ గ్రామాన్ని తహసీల్దార్ బుధవారం సందర్శించారు. చెరువు పరిసరాలను పరిశీలించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.ఓ వ్యక్తి చెరువును ఆక్రమించి, వరి పంట వేయడంతో పాటు చెరువు వద్దకు వెళ్లేందుకు దారి మూసివేయడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ దారిని క్లియర్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వరి పంట వేసిన విషయంపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఆర్‌ఐ దొర,ఎల్లవరం వీఆర్వో రమణ,సర్వేయర్ విష్ణు,ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



పాడేరులో గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



అన్న సమారాధనలో భక్తులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఐటీడీఏ క్వార్టర్స్ సమీపంలో గౌరిపరమేశ్వరుల నెల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి, ఆలయ కమిటీ ప్రతినిధులు, వైస్ ఎంపీపీ గంగపూజారి శివ, భక్తులు గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సహకారంతో గౌరి సేవా సంఘం పర్యవేక్షణలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. సుమారు 4వేల మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

రాజవొమ్మంగి: స్థానిక షిరిడీసాయిబాబా ఆలయంలో పురోహితుడు భయ్యా భానుమూర్తి ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయానికి విరాళాలు ఇచ్చిన పాయకరావుపేటకు చెందిన పామిరెడ్డి శ్రీకర్, విశాఖపట్నానికి చెందిన దంపతులు రవిశంకర్, సునీత దంపతులను కమిటీ అభినిందించింది.

నేడు కార్తీక వన సమారాధన

స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం కార్తీక వన సమారాధాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటి తెలిపింది. భక్తులు హాజరై తీర్థ, ప్రసాదాలుస్వీకరించాలని కోరారు. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకట్రామయ్య, విజయలక్ష్మి దంపతులు విచ్చేసి భక్తులను ఉద్దేశించి ప్రసంగించనున్నట్టు తెలపారు.



రాజవొమ్మంగిలో శివునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

జీసీసీ గోడౌన్ తనిఖీ



జీసీసీ గ్యాస్ గోడౌన్ అధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

హుకుంపేట: పాడేరులో ఉన్న హుకుంపేట మండలానికి సంబంధించిన ఇండియన్ గ్యాస్ కనెక్షన్స్ తక్షణమే హుకుంపేటకు బదిలీ చేయాలని రాష్ట్ర జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఇండియన్ గ్యాస్ గోడౌన్ జీసీసీ పెట్రోల్ బంకును ఆయన తనిఖీ చేపట్టారు. హుకుంపేటలో గ్యాస్ లబ్ధిదారులకు పాడేరులో గ్యాస్ అందిస్తున్నారని పలువురు శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఐటీడీఏ పీవోతో ఫోన్‌లో మాట్లాడి హుకుంపేటకు సంబంధించిన అన్ని గ్యాస్ కనెక్షన్‌లను తక్షణమే బదిలీ చేయాలని కోరారు.పలువురు అధికారులున్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి



పార్టీ నాయకులు, కార్యకర్తలతో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. బుధవారం తన నివాసంలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను అధిష్టానం గుర్తిస్తుందని తెలిపారు. ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ అభ్యర్థుల గెలుపునకు అందరూ పనిచేయాలన్నారు. పార్టీలో అంతర్గతంగా ఎటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు, పార్టీ మండల అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెద్దం నర్సింగరావు, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పంచాడి తిరుపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాది రమేష్, పార్టీ పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, సర్పంచ్‌లు పెట్టెలి సుష్మిత, దురియా భాస్కరరావు, ఎంపీటీసీలు దురియా ఆనంద్‌కుమార్, గరం పూర్ణ, సమర్ది శత్రుఘ్న, స్వాభి రాంచందూర్, సీనియర్ నాయకులు జన్ని నరసింహమూర్తి, పల్టాసింగి విజయ్ కుమార్, శ్రీరాములు, గెన్ను నరేష్, బాలరాజు, రామూర్తి, రాజ్‌కుమార్,ఎంటీఆర్ సాంబ, గుడివాడ ప్రకాష్, జగన్, అర్జున్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.